# ప్రజల జీవనోపాధిని నాశనం చేసేవిధంగా పాడి రంగంలోకి విదేశీ పెట్టుబడులు

**"ఆవు** మాతల్లిని మనం చూసుకుంటే, ఆ తల్లి మనలను కాచుకుంటుంది" రెండెకరాల కౌలు రైతు లక్ష్మి మాటలివి. రెండు గేదెలు. ఒక ఆవుతో ఇద్దరు పిల్లలను సాకుతూ, మగడితో కలసి కౌలు పొలంలో పనిచేస్తుంది. కౌలు, సాగు ఖర్చులూ పోగా మిగిలే గడ్డితో పాడి పశువులను మేపితే రోజూ 20 లీటర్ల పాలు. వాటిని లీటరు 24 రూ॥లకు అమ్ముతుంది. భారత్‌లో గ్రామీణ కుటుంబాలలో సగానికి పైగా – 7 కోట్ల కుటుంబాలకు – ఒకటో రెండో పాడి పశువులున్నాయి. భారత పాడి పరిశ్రమ 9 కోట్లమందికి – అందులో 7.5 కోట్లమంది మహిళలు – ఉపాధి కల్పిస్తుంది. రైతాంగ కుటుంబాలకు ఇది ఆదాయ వనరు. వీరి వద్దనున్న వాటిలో 90 శాతం దేశీయ పాడి పశుజాతులే. వీరి శ్రమ వల్లే పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో దేశం వుంది. ఈ రైతాంగ మహిళలకు తమ పాడినీ, ఆవు మాలచ్మినీ కాపాడుకోవటమెలాగో తెలుసు.

"గో సంరక్షణ హిందూ సంస్కృతిలో భాగ"మంటూ గొంతు చించుకు అరుస్తున్నవారే, గోవధను ఆపటానికంటూ హింసాకాండకు పాల్పడుతున్న రౌడీ గుంపులను ప్రోత్సహిస్తున్నవారే, దేశంలో పాడి పశుజాతులన్నింటినీ వినాశనానికి గురిచేస్తున్నారు; రైతాంగ మహిళల జీవనోపాధిని ధ్వంసం చేస్తున్నారు. కేంద్రంలోని భా.జ.పా. ప్రభుత్వం పాడిరంగంలోకి నూటికి నూరుశాతం విదేశీ పెట్టుబడికి అనుమతించింది. దీనివల్ల కలగబోయే విధ్వంసమిది.

లక్షలాది కుటుంబాలకూ, టీ స్టాళ్ళకూ, చిన్న హోటళ్ళకూ దేశంలోని పాడి రైతులు పాలు సరఫరా చేస్తారు. మిగిలిన పాలను పెరుగు, వెన్న, నెయ్యి, మజ్జిగగా మార్చి స్థానికంగానే అమ్ముతారు. గ్రామ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో 96 వేల పాడి సహకార సంఘాలున్నాయి. పాడి రైతాంగం నుండి పాలు సేకరించి, నగరాలలో పంపిణీ చేసే విస్తృత వ్యవస్థను కలిగివున్నాయి. ఇవి పాల ఉత్పత్తిలో లేవు. పాడి సహకార రంగం సజావుగా వుందని చెప్పలేముగానీ పాడి రైతాంగానికి ఆదాయాన్ని సరిగ్గానే అందించ గలుగుతున్నాయి.

పాడి రైతాంగం దేశీయ పాడి జాతి రకాలనే పెంచుతున్నారు. పొలంలో వచ్చే వరిగడ్డి, గట్టు మీద పచ్చగడ్డి వీటికి సరిపోతుంది. వీటి పేడ కూడా పొలానికి ఎరువుగా ఉపయోగపడుతుంది. వీటికోసం ప్రత్యేక దాణా (ఫీడ్) అందించనవసరలేదు. సాధారణంగా ఎక్కువ రోగ నిరోధకశక్తిని కలిగివుంటాయి. అందువల్ల రైతాంగ పెట్టుబడి మదుపు తక్కువగా వుండి మిగులు ఎక్కువగా వుంటుంది.

పేద రైతాంగం, మధ్యతరగతి వినియోగదారులు, చిన్న వ్యాపారులు, సహకార సంఘాలతో భారత పాడి రంగంలో 85 శాతం జాతీయ మార్కెట్టు స్వభావంతో ప్రజారంగంగా వుంది. వ్యవసాయరంగ ఉత్పత్తిలో 22 శాతం పాడిరంగానిదే.

ఈ జాతీయ పాడిరంగాన్ని కబళించటానికి బహుళజాతి డైరీ కంపెనీలు పూనుకున్నాయి. నూతన సాంకేతికతతో పాల దిగుబడి పెంచి రైతాంగ ఆదాయాన్ని ఇనుమడింపచేయటమన్న వాదనతో ఇవి ముందు కొచ్చాయి. నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాల మెరుగుదల పేరిట చొచ్చుకు రావటానికి పూనుకున్నాయి. మరోవైపున ప్రపంచ వాణిజ్యసంస్థ షరతుల ప్రకారం పాల ఉత్పత్తుల దిగుమతులపై ఆంక్షలు ఎత్తివేయాలనీ, భారత పెట్టుబడిదారులతో సమానంగా తమకూ అవకాశాలు కల్పించాలనీ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చాయి. వీటికి తలవంచిన ప్రభుత్వం పాడిరంగంలోకి నూటికి నూరుశాతం విదేశీ ప్రైవేటు పెట్టుబడిని అనుమతించింది.

**దీనివల్ల జరగబోయేదేమిటి?**

ప్రపంచస్థాయి డైరీ కంపెనీలు దేశంలోకి వస్తాయి. రైతాంగం నుండి పాలు సేకరించటాన్ని యివి చెయ్యవు. వేల సంఖ్యలో పాడి పశువులతో డైరీ ఫారమ్‌లు ప్రారంభిస్తాయి. వీటిని పాడి ఫ్యాక్టరీలు అని పిలవవచ్చు.

ఈ పాడి ఫ్యాక్టరీలు ఇటీవలి సంవత్సరాలలో పాడి, మాంస ఉత్పత్తిరంగపు వృద్ధిలో 80 శాతంగా వున్నాయి. సాంప్రదాయక చిన్న పాడి కంటే రెండు రెట్లు ఎక్కువ వృద్ధితో వున్నాయి. ప్రపంచంలో పౌల్ట్రీలో 74 శాతం, పంది మాంసంలో 40 శాతం, గ్రుడ్లలో 68 శాతం ఈ ఫ్యాక్టరీ క్షేత్రాలలోనే సాగుతున్నది. పాడి ఫ్యాక్టరీలు కూడా ఈ స్థాయికి చేరుకుంటాయన్నది విశ్లేషకుల అంచనా.

**ఈ పాడి ఫ్యాక్టరీల వల్ల వచ్చే నష్టాలేమిటి?**

ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనా ప్రకారం 2010లో ఆహార ధాన్యాలలో మూడవ వంతును ఈ పాడి ఫ్యాక్టరీలలో పశుదాణాగా వాడారు. 2050 నాటికి యిది 50 శాతమౌతుందని అంచనా. ఈ శతాబ్దపు మొదటి పదేళ్ళలో ఈ పశుదాణా కోసం సోయాబీన్, మొక్కజొన్నతో 5.6 కోట్ల హెక్టార్ల భూమిని సాగు చేశారు. (వరల్డ్ వాచ్ ఇన్‌స్టిట్యూట్) సాగుభూమితో పాటు అడవులు నరికి కూడా దాణా సాగు పెంచారు. వాతావరణ వేడిమికి కారణమౌతున్న గ్రీన్ హౌస్ వాయువుల్లో నాల్గవవంతు, ఈ దాణా వ్యవసాయం ద్వారా వెలువుడుతున్నవే.

ఈ పాడి పశువుల పేడ విలువైన ఎరువుగా ఉపయోగపడుతుండగా, పాడి ఫ్యాక్టరీల నుండి విపరీతంగా బయటకొచ్చిన పేడ విషతుల్యమౌతున్నది. ఇవి గ్రీన్ హౌస్ వాయువుల్లో 10 శాతం విడుదల చేస్తున్నాయని ఎఫ్ఏఓ అంచనా. ఇక పాడి ఫ్యాక్టరీ అవసరాల కోసం వాడే చమురుతో విడుదలయ్యే వాయువులు 20 శాతం వరకూ వున్నాయి. పాడి ఫ్యాక్టరీలతో తలెత్తే

వాతావరణ సమస్యలివి. ఏడు కోట్ల రైతాంగ కుటుంబాలు నేడు ఉత్పత్తి చేస్తున్న పాలను, పాడి ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేస్తే దాదాపు 25 లక్షల హెక్టార్లు సాగుభూమిని వీటికోసం వాడాల్సి వస్తుంది. వాతావరణంపై దుష్ప్రభావాలు ఎంతగా ఉంటాయో ఎవరైనా వూహించుకోవచ్చు.

దీనికంటే ముఖ్యంగా, తక్షణమే 9 కోట్లమంది తమ జీవనోపాధిని కోల్పోతారు. విదేశీ కంపెనీలు పాడి రైతాంగం నుండి పాలు సేకరించవు. సామ్రాజ్యవాద దేశాలలో గుట్టలుగా పేరుకుపోతున్న పాల పొడి దిగుమతి చేసుకుని ఇక్కడ చౌకగా అమ్ముతాయి. ఆవిధంగా పాడి రైతాంగాన్ని తొలగించి, పాడి ఫ్యాక్టరీలను మొదలుపెడతాయి. సామాన్యుల ఆహారాన్ని వాణిజ్య సరుకుగా మార్చివేస్తాయి. కొంతకాలం యివి పాడి రైతాంగం నుడి కొన్నా కూడా రైతుకొచ్చే ఆదాయం తగ్గిపోతుంది. భారత జంతు సంరక్షణ సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఏపిఓ) లెక్కల ప్రకారం పాడి రైతులకు అమ్మకం ధరలో 70 శాతం వరకూ భారత్‌లో అందుతున్నదనీ, అమెరికాలోనూ, బ్రిటన్‌లోనూ రైతులకందేది 38 శాతమనీ, ఆదాయం తగ్గి పాడి రైతాంగం నష్టపోతారనీ తెలిపింది.

పాడి పశువుల్లో దేశీయ రకాలన్నింటినీ కోల్పోతాము. ఇవి ఇక్కడి వాతావరణానికి తట్టుకొని సగటు దిగుబడిని 6–10 లీటర్ల వరకూ పాలను ఇస్తున్నాయి. పాడి ఫ్యాక్టరీలతో, పాలు ఒక వాణిజ్య సరుకుగా మారటంతో, పాడి రైతులు అధిక దిగుబడినిచ్చే రకాలకు మారాలి. అధిక దాణా, అధిక పోషణ, ఔషధాలు ఉంటే తప్ప ఇవి అధిక దిగుబడి నివ్వవు. దీనికి అధిక పెట్టుబడి అవసరం. దీనితో పేద రైతాంగం తొలగించబడి, వాణిజ్యస్థాయి పాడి పశుపోషణ చేయగలవారే ఈ రంగంలో వుంటారు. వీరిపై కూడా పాడి ఫ్యాక్టరీలదే పెత్తనం.

చైనా అనుభవమే మన కళ్ళు తెరిపించాలి. 90 శాతం ప్రజారంగంలో రైతాంగ ఉత్పత్తిగా వుండి, సహకార రంగం పంపిణీ చేస్తున్న చైనా పాడి రంగం కొద్దికాలంలోనే విదేశీ కంపెనీల ఆధీనమైపోయింది. బహుళజాతి కంపెనీలు డానోన్, నెస్లే, మీడ్‌జాన్సన్‌లు ఐదేళ్ళలో చైనా పాడిరంగంలో మూడింట రెండు వంతులను మింగివేశాయి. 2008లో బయటపడ్డ వాస్తవాలతో ఈ బడా కంపెనీల మోసాలు వెలుగు చూశాయి. న్యూజిలాండ్‌కు చెందిన ఫొంటెర్రా కంపెనీ మెలమైన్‌తో కల్తీ అయిన పాలనూ, పసిపిల్లలకు పాలపొడిని సరఫరా చేసింది. దీనివల్ల ఆర్గురు శిశువులు మూత్రపిండాల్లో రాళ్ళతో మరణించగా, ఇతరులలో మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. 860 మంది ఆస్పత్రులలో చేర్చాల్సి రాగా, మొత్తం 3 లక్షల మంది ఈ రసాయనానికి గురయ్యారు. పాలల్లో ఎక్కువ ప్రొటీన్లు ఉన్నట్లు కన్పించటానికి మెలమైన్‌ను కంపెనీయే పాలలో కలిపింది. బడా కంపెనీల వల్ల కల్తీలేని పరిశుభ్రమైన పాలు సరఫరా అవుతాయన్న హామీ లేదు.

ఈ పాడి ఫ్యాక్టరీలను నిర్వహించే కంపెనీలన్నీ మాంస తయారీ కార్యకలాపాల్లోనూ వున్నాయి. పాడి పశువులకు పుట్టిన దూడలను ఒక్కరోజు మాత్రమే వీటి వద్ద వుంచుతారు. రెండోరోజు దూడలను మాంస కేంద్రానికి తరలిస్తారు. కరువు, తప్పనిసరి పరిస్థితుల్లోనే రైతాంగం పాడి పశువులనమ్ముకుంటారు. వాటిలో ఎక్కువభాగం కబేళాలకే చేరతాయి. 'గోసంరక్షక' ప్రభుత్వ చర్యతో దూడలతోసహా పశువులన్నీ కబేళాకే చేరతాయి.

ఇక మిగిలేది ఉపాధి కల్పన. 7 కోట్ల కుటుంబాల ఉపాధిని నాశనం చేసిన తర్వాత పాడి ఫ్యాక్టరీలు కల్పించే ఉద్యోగాలు వేలల్లో కూడా వుండవు. ఉద్యోగాలిచ్చినా వారిని కూడా తీవ్ర శ్రమదోపిడీకీ, అధిక పనిభారానికీ, భద్రతాలేమికీ గురిచేస్తాయని అనేక నివేదికలు తెలిపాయి.

ఈ పాడి ఫ్యాక్టరీల పెరుగుదలకు సామ్రాజ్యవాద దేశాలే కారణం, సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలు ఈ పాడి ఫ్యాక్టరీలకు సబ్సిడీలిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. ఓఇసిడి దేశాలు ఈ పాడి ఫ్యాక్టరీ కంపెనీలకు 5,300 కోట్ల డాలర్లను 2013లో సబ్సిడీగా యిచ్చాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు 73 కోట్ల డాలర్లను సబ్సిడీగా యిచ్చాయి. అమెరికా సామ్రాజ్యవాదం యిస్తున్న వ్యవసాయరంగ సబ్సిడీల్లో మూడింట రెండు వంతులు మాంస, పాల కంపెనీలకే వెళుతున్నాయి.

సామ్రాజ్యవాద ప్రభుత్వాలు పాడి ఫ్యాక్టరీలకు ఆర్థిక మద్ధతుతో పాటు రాజకీయ మద్దతు కూడా యిస్తున్నారు. ప్రపంచ వాణిజ్యసంస్థ షరతులను వీటికి అనుకూలంగా అమలుచేస్తున్నారు. విదేశీ కంపెనీలు స్థానిక ఉత్పత్తులు వాడాలన్న నిబంధనను అమెరికా వ్యతిరేకించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ వివాద పరిష్కార వేదికలో తన వాదనను నెగ్గించుకుంది. సూర్యకాంతి నుండి విద్యుత్తు తయారీకి వాడే పరికరాలలో 30 శాతం స్థానిక కంపెనీల నుండి సేకరించాలన్న భారత నిబంధనను ఇవి కొట్టివేసింది. దీని తర్వాత భారత రైతాంగం నుండి పాలు సేకరించాలన్న నిబంధనను విధించగలస్థితి భారత ప్రభుత్వానికి లేదు.

నూటికి నూరుశాతం అనుమతించక ముందు, అమెరికాకు చెందిన ష్రేబర్ ఫుడ్స్, భారత పెట్టుబడి దారుడు గోయంకాతో కలిసి ష్రేబర్ – డైనమిక్స్ పాడి కంపెనీని పెట్టింది. ఇది మహారాష్ట్రలోని రైతాంగం నుండి పాలు సేకరించి మెక్ డొనాల్డ్ కంపెనీకి అంద జేస్తుంది. ఈ కంపెనీ పూనా దగ్గర 120 హెక్టార్లలో 6 వేల ఆవులతో "ఫ్యూచర్ రెడీ" పాడి ఫ్యాక్టరీని 2012లో ప్రారంభించింది. న్యూజిలాండ్‌కు చెందిన ఫొంటెర్రా పాడికంపెనీ, భారత సహకార రంగంలోని ఇఫ్కో (ఐఎఫ్ఎఫ్సిఓ)తో గ్లోబల్ డైరీ హెల్త్ అన్న కంపెనీతో కలిసి నెల్లూరులోని ఇఫ్కో సెజ్‌లో 65 హెక్టార్లలో 13 వేల ఆవులతో పాడి ఫ్యాక్టరీ నెలకొల్పింది. నెల్లూరుకే చెందిన దొడ్ల డెయిరీని 30 కోట్ల రూ॥లతో కొనుగోలుచేసిన కార్గిల్ వెన్‌చర్స్ ఇప్పుడు స్వంత పాడి ఫ్యాక్టరీని నెలకొల్పే పథకాలతో వుంది.

| ప్రపంచంలో పెద్ద డెయిరీ కంపెనీలు (2015) | | |
|---|---|---|
| కంపెనీ | దేశం | డెయిరీ అమ్మకాలు (కోట్ల డా॥) |
| లాక్టాలిస్ | ఫ్రాన్సు | 1995 |
| నెస్లే ఎస్ఏ | స్విట్జర్లాండ్ | 1523 |
| డానోన్ | ఫ్రాన్సు | 1180 |
| రాయల్ ఫీజ్‌లాండ్ | నెదర్‌లాండ్స్ | 1202 |
| ఆర్లా ఫుడ్స్ | డెన్‌మార్క్ | 1099 |
| యూనీలీవర్ | నెదర్‌లాండ్స్ | 500 |
| యాకుల్ట్ హన్సా | జపాన్ | 348 |
| బెల్ గ్రూపు | ఫ్రాన్సు | 309 |

పాడి రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులను అనుమతించటం దేశ ప్రజల ప్రయోజనాలకు హానికరం. కోట్లాది పేద రైతుల జీవనోపాధిని ధ్వంసం చేస్తుంది. ఇక్కడి పరిస్థితులను తట్టుకుని తగిన పాల దిగుబడి నిస్తున్న పాడి పశువులలోని దేశీయ రకాలను కనుమరుగు చేస్తుంది. పర్యావరణాన్ని కలుషితం చేయటంతోపాటు ప్రజారోగ్యాన్ని క్లిష్టతరం చేస్తుంది. దేశీయ మార్కెట్టుపై గుత్తాధిపత్యం పొందిన విదేశీ కంపెనీలు లాభాలూ, రాయల్టీలు, పన్ను రాయితీలు, వేతనాలు తదితర రూపాలతో దేశ ఆర్థిక వనరులను తరలించుకుపోతాయి. ప్రపంచ వాణిజ్యసంస్థ, ద్విపక్ష వాణిజ్య, పెట్టుబడి, వివాదాల పరిష్కారం తదితర ఒప్పందాలతో సామ్రాజ్యవాద పాలకులు భారత ప్రభుత్వాన్ని ఏ చర్య తీసుకోలేనంతగా నిర్వీర్యం చేస్తారు. కోట్లాది ప్రజల ప్రయోజనాలను కాలరాచివేసే, దేశ ఆర్థిక వనరులను సామ్రాజ్యవాదుల పరంచేసే భారత పాలకుల ఈ చర్యను తీవ్రంగా ప్రతిఘటించాలి. అందుకు ప్రజలను సంఘటిత పోరాటాలకు సంసిద్ధం చేయాలి.

| చిన్న పాడి | పాడి ఫ్యాక్టరీలు |
|---|---|
| **1. దాణా** : సాగు దిగుబడిలో భాగం | ప్రత్యేకంగా సాగుచేయాలి |
| **2. పేడ** : ఎరువుగా వినియోగం | మిథేన్ గ్యాసు విడుదల, పరిసరాల కాలుష్యం |
| **3. ఉపాధి** : రైతాంగ కుటుంబాలకు ఆదాయ వనరు | అతికొద్దిమందికి ఉపాధి, తక్కువ వేతనం, అధిక పనిభారంతో శ్రమదోపిడీ |
| **4. భూమి** : స్వల్పంగా అడవుల వినియోగం | దాణా కోసం పంట భూమి తరలింపు, పెద్దఎత్తున అడవుల నరికివేత |
| **5. మార్కెట్టు** : ప్రాంతీయ, చిన్న మార్కెట్లకు చేయూత | మార్కెట్టు గుత్తాధిపత్యం |
| **6. పశుపోషణ** : సంరక్షణతో పాడి పశువుల్లో జీవ వైవిధ్యం కాపాడుతుంది | ఒకటి రెండురకాల పాడి పశువులతో జీవ వైవిధ్యం కోల్పోవటంతోపాటు జీవకారుణ్యరహిత కార్యాలు |
| **7. భూసారం** : కార్బన్ ఎక్కువగా కలిగివుండి ఆరోగ్యకరం | తగ్గుదల |
| **8. ఆరోగ్యం** : పేదలకు పోషకారహారం | పరిసర ప్రజలకు జల, వాయు కాలుష్యం యాంటీబయాటిక్ మందులకు లొంగని బాక్టీరియా, బాగా ప్రాసెస్ చేసిన మాంసం కాన్సర్‌కు దారితీసే అవకాశం. |
| **9. సబ్సిడీలు** : సబ్సిడీ కోరని రైతాంగం | పన్ను, మదుపు రాయితీలు |

ooooo